

# చిక్కీ

ఐ.ఎమ్.ఎ. సావనీర్ - 1985

---

"ప్రభుత్వం నూతన ప్రణాళికల్ని రూపొందించాలి కానీ... అది తమ రాజకీయ సింహాసనానికి మరో పునాది రాయి కోసం కాకూడదు."

\- జయప్రద

---

"మమ్మీ! నాకూ చిక్కీ కావాలి." కాన్వెంట్ బ్యాగ్ ఓ మూలకు, బూట్లు మరో మూలకు విసిరేసి, మురికి చేతుల్తో నన్ను చుట్టేశాడు వంశీ.

"చిక్కీ ఏవిటిరా?"

"అదే మమ్మీ! వేరుశనగ అచ్చు."

"అది మనింట్లో లేదుగానీ, క్రీమ్ బిస్కెట్లు వున్నాయి. స్నానం చేసిరా పెడ్తాను." వాడు విసిరేసిన పుస్తకాల్ని ఏరుతూ, అన్నాను.

"ఐ వాంట్ చిక్కీ వోన్లీ. బిస్కెట్స్ వద్దు." కాళ్ళతో నేలను బాదుతూ, అడుగుతున్న వాణ్ణి చూస్తే... నా ఎలిమెంటరీ స్కూలు చదువు, ఆనాటి మా క్రమశిక్షణ గుర్తొచ్చింది నాకు.

ఎదిగిన ఈ విద్యావిధానం ఏం సాధించింది? ఇంగ్లీషు చదువులు తప్ప!

మావారు చేతులు చాపి పిల్చారు వాడిని. సృష్టి ఎంత చిత్రమైందో! తన జీన్స్ పంచుకొని పుట్టిన బిడ్డ ఏం చేసినా ముద్దే...

"అమ్మ నాకు చిక్కీ యివ్వలేదు. హరికి ఇచ్చింది." కంప్లయింట్ చేస్తున్నాడు వాడు.

అక్కడే వున్న మా వంటామె చెప్పింది "లేదు బాబూ! స్కూల్లో యిచ్చారంట నా మనవడికి...!"

"అబద్ధం! స్కూల్లో ఎందుకిస్తారు? మా కాన్వెంటులో ఇవ్వలేదే," ఏడుపు తన్నుకొస్తోంది వాడికి.

"ఇంట్లో వుంచుకుని లేదంటారా?" ఏ వయసులో బాధలు ఆ వయసువే...

"మన ముఖ్యమంత్రి విద్యార్థులకు చిక్కీలు సప్లై చేస్తున్నారురా కన్నా! నీకు కావాలంటే, నేను కొనిస్తాలే...." వాడిని ఓదారుస్తున్నారు మా వారు.

"పిల్లలకే కాదు బాబూ! మా ఊళ్ళో అందరికీ పంచారంట."

"అందరికీనా? ఎందుకూ?" పుస్తకాల పని పూర్తి చేసి బూట్లు ఏరుతూ అడిగాను.

"మీరు లేవండి. నేను తీస్తాను." నా చేతిలో బూటు అందుకుంటూ చెప్పింది నరసమ్మ.

"గర్భిణీ వాళ్ళకిమ్మన్నారటమ్మా. మా ఊళ్ళో ఒక్కతే గర్భిణీ స్త్రీ. అందుకే.... అందరికీ పంచేశారు వేరుశనగ ముద్దలు." సంబరంగా చెప్తోంది నరసమ్మ.

నాకు మాత్రం ఈ కొత్త పథకం ఏ మాత్రం నచ్చలేదు. కానీ, ఆ మాట పైకి అంటే, గవర్నమెంటు బీదోళ్ళకు ఏమిచ్చినా ఈ గొప్పోళ్ళకు నచ్చదు'.... అనుకుంటుంది నరసమ్మ. కానీ ఈ లక్షల ఖర్చు అవసరమైనదేనా?

నరసమ్మ వెళ్ళాక అదే అన్నాను ఆయనతో. "నిజమే... ఆ ఖర్చు, రోడ్ల మీద పేచ్ వర్క్‌కన్నా ఉపయోగిస్తే... బావుండేది."

"చాలా బావుంటుంది. కానీ, దానివల్ల పేద ప్రజలకేవిటి లాభం?" అంటూ లోపలకొచ్చింది తన స్నేహితురాలు ప్రమీలతో మా ఆడబిడ్డ ప్రణతి. ఆ వెనుకనే ప్రణతి శ్రీవారు... వేణు.

"అలా అనకు ప్రణతీ! పేదవాళ్ళు బస్సుల్లో ప్రయాణం చేయడం లేదా? వాళ్ళవి మాత్రం ప్రాణాలు కావా? పోను ఒక రోడ్, రాను ఒక రోడ్ వేస్తే ఇన్ని యాక్సిడెంట్స్ కావు గదా!" అని కుర్చీలాక్కుని కూర్చుంది ప్రమీల... ఆమె భర్త లారీ డ్రైవరు.

"అంటే నీకు హైవేలో... వన్‌వేలు కావాలన్న మాట... ఎంత ఆశ?" నవ్వింది ప్రణతి తనూ ప్రమీల ప్రక్కనే కూర్చుంటూ.

"ఈ కంట్రాక్టర్లు వేసే పేచ్ వర్క్సు ఎంత కాలం వుంటాయిలే?" అని బావమరిది వైపు తిరిగి నవ్వారు మా ఆయన.... వేణు పెద్ద కంట్రాక్టర్.

ఈ పెద్దవాళ్ళ టాపిక్‌లో చిక్కీ సంగతి మరిచిపోయి, వంశీ బిస్కెట్ల కొరకు లోపల కెళ్ళిపోయాడు.

"అంతా నేరం మా మీద వెయ్యకు బావా! ఇంజనీర్లను చెయ్యి చాపొద్దని చెప్పు. అప్పుడు రోడ్లు ఎంత బాగుంటాయో చూడు!"

"మిమ్మల్నెవరు లంచాలిమ్మన్నారండి? మీరు సమపాళ్ళల్లో వేస్తే రోడ్లు... ఎవరి కండీ గట్స్ వుంటాయి మిమ్మల్ని లంచాలడగటానికి?"

"నో! నో! మీరు పొరపాటు పడ్తున్నారు. చేసిన పనికి సవాలక్ష వంకలుపెట్టి, బిల్ పాస్ చేయరు. అప్పుడు ఎవరికి నష్టం చెప్పు?"

మావారు ఏదో చెబ్తున్నారు. నేను ప్రణతివైపు తిరిగాను. "ఏమిటీ? ఊరకరారు మహానుభావులు!"

"చిన్న పనుండి వచ్చాను వదినా... అయినా ఇప్పుడు వద్దులే. మంచి డిస్కషన్‌లో వున్నాం. మనం తర్వాత మాటాడుకుందాం" అంటూ కుర్చీని మరికాస్త దగ్గరకు లాక్కుంది ప్రణతి... ఆమె గవర్నమెంట్ డాక్టర్.

ఎప్పుడు వెళ్ళిపోయారో! వేణు, శ్రీవారు, గోదావరి వరదల టాపిక్‌లోకి వెళ్ళి పోయారు.

"అది కాదు బావా! ఈ రోజు వీళ్ళిచ్చే పదికిలోల బియ్యం, చీర, పంచెలతో పేదవాళ్ళ జీవితాలు వెళ్ళమారిపోవు..."

"బయటకు అనకు. కుళ్ళు అనుకుంటారు." అని నవ్వారు మావారు.

"నవ్వకు బావా! ఎప్పుడు అతివృష్టో... ఎప్పుడు అనావృష్టో తెలీకుండా, ఏమిటీ బ్రతుకు భయాలు? నోట్లో వేసుకుంటే కరిగిపోయే చిక్కీలు, నాలుగు రోజులు కడ్తే చిరిగిపోయే చీరలు, ఇవా వాళ్ళని వుద్ధరించేది? టౌన్‌లోనే మిట్ట ప్రాంతం చూసి వాళ్ళకు సురక్షితంగా ఇళ్ళు కట్టించి ఇవ్వాలిగానీ...." ఆవేశపడ్డాడు వేణు.

"వరదల్లో అన్నీ పోగొట్టుకున్న వాళ్ళకు, కూడూ, గుడ్డా ఇవ్వకపోతే ఎలాగ వేణూ?" శ్రీవారు అన్నారు.

ఈసారి బావను ఉడికించడానికి వేణుకు మంచి ఛాన్స్ దొరికింది.

"ఇవ్వాల్సిందే! కానీ... చిన్న సైక్లోన్‌కి గుడిశ కప్పుమీద ఒక్క గడ్డిపోచ ఎగిరిపోక పోయినా సరే, మీ ఆఫీసర్లు గవర్నమెంటుకు ఇంత పొడుగున వ్రాసి, మధ్యలో మింగేయడం లేదూ?..."

"అబ్బో! సైక్లోన్ నా వైపు తిరిగినట్టుంది. తప్పుకోవడం మంచిది." అని ఎదురు జోక్ విసిరారు మావారు.

"ఆ ఇచ్చే డబ్బులకోసం, గుడ్డలకోసం, రోజుల తరబడి క్యూలో నిల్చుని, తమ కూలీల్ని నష్టపోత్ను శ్రామిక జనం... సకాలంలో వాళ్ళు దొరక్క నష్టపోతున్న తిండి గింజలు పండించే రైతులు.... ఇవన్నీ నష్టాలు కావా?"

"వీటన్నిటి కంటె, నన్నడిగితే, ఆ టైమ్‌లో వుచిత వైద్యం ఇవ్వాలి. ఎంత మంది డాక్టర్లు ఆ టైములో ముందు కొస్తున్నారు?" వేణుని మధ్యలో అడ్డుకుంది ప్రమీల.

"ఈ మారు నా మీదకు బాణం వచ్చి పడింది." అని నవ్వింది ప్రణతి.

నేను నిశ్శబ్దంగా వింటున్నాను. నాలోనూ అనుమానాలున్నాయి. భావావేశా లున్నాయి. కానీ నా ప్రశ్నలకు వాళ్ళ దగ్గరనుండి, జవాబు దొరికేటప్పుడు నేనెందుకు మాట్లాడడం...?

"బాణం కాదుగానీ ప్రణతీ... ఆ మధ్య మా కజిన్‌కి ఆపరేషన్ చేయాల్సి వస్తే ప్రైవేట్ ఫీజులు కట్టుకోలేక గవర్నమెంటు హాస్పిటల్‌కి వెళ్తే... బెడ్‌లో చేరడానికి, చేరిన తర్వాత డిశ్చార్జి అయిందాకా అయిన మొత్తం ఖర్చు లెక్కేసుకుంటే తడిచి మోపెడయిందట... మందులన్నీ వ్రాసిచ్చారట. మరి... గవర్నమెంట్ సప్లై చేసే మందులు.... ఏమవుతున్నాయో?"

"పాపం ఆ టైములో నిజంగానే మందులు లేవేమో!" వేణు నోరు జారాడు.

"మీ ఆవిడ డాక్టర్ అని.... డాక్టర్లని సమర్థించకు వేణూ జరుగుతున్నదే అదీ."

కిటికీలో నుంచి విసురుగా వచ్చింది ఓ గాలి తెమ్మెర.... దానికెవరు లంచం ఇచ్చారోగానీ....

"మొదట టీ తాగండి" అన్నాను నరసమ్మ తెచ్చిన టీ అందరికీ అందిస్తూ... ఏడుపు ముఖంతో వచ్చిన కొడుకుని ఒళ్ళోకి తీసుకున్నాను.

"ఏరా నాన్నా? ఏం కావాలి?"

వాడు హాల్లో ఓ మూలకి చెయ్యి చూపించాడు. నేను గమనించలేదు. అక్కడ హరి నిల్చొనున్నాడు. వాడి పెదవి మీద మిగిలిపోయి అంటుకు పోయిన వేరుశనగ ముక్క... అది నా సుపుత్రుడికి చిక్కీని గుర్తు చేసినట్టుంది.

"నాకు చిక్కీ కావాలి." అని రాగం స్థాయి పెంచాడు.

"నీ చిక్కీ కాదుగానీ, చిన్నా! మా కందరికీ ఎన్ని చిక్కులు తెచ్చిపెట్టిందిరా?" అంటూ నా దగ్గరనుండి, వాడిని తన ఒళ్ళోకి లాక్కున్నారు మావారు.

ప్రజల దగ్గరనుండి ప్రజాస్వామ్య ప్రభుత్వం దాకా, విమర్శించేలా చేసిందిరా నీ చిక్కీ...." వేణు వంత కలిపాడు.

"చిక్కీ మీద ఓ కథ వ్రాయరాదూ?" అంది ప్రణతి. ప్రమీల వైపు తిరిగి ప్రమీల చిన్న సైజు రచయిత్రి.

"కథలు చదివి మారడానికి... వీళ్ళల్లో ఎవరికైనా, వీళ్ళు చేసేది తప్పు అని.... తెలీకపోతే కదా!" ప్రమీల లేచి నిల్చుంది. ప్రణతి కూడా లేచింది.

"అదేమిటీ? నాతో పనన్నావు కదా! అప్పుడే వెళ్ళిపోతావా?"

"ఎక్కడా? చిన్నిగాడి చిక్కీతో ప్రారంభమైన వాగ్యుద్ధంలో టైమే తెలీలేదు. మరలా వస్తాను. హాస్పిటల్‌కి టైమయింది."

"సరే!" నేనూ లేచాను. వాకిటి బయటకు వచ్చాం. "ప్రణతీ...!" మావారు చెల్లెల్ని పిలిచారు.

"మీ ఫ్రెండ్‌ని నిజంగానే కథ వ్రాయమని చెప్పు. మనం చేసేది తప్పు అని తెలిసినా, అది అందరూ గమనించడం లేదనే... ఎవరికి వాళ్ళు అనుకుంటాం... ఎవరైనా వేలెత్తి చూపినప్పుడు కొందరు కాకపోతే కొందరు... కొంతగాకపోతే కొంత మార్తారు."

మావారి మాటలకు ప్రమీల ఇటు తిరిగింది. "చూడమ్మా! కథ వ్రాసి ఊర్కో కండి. దాని మీద పాఠకుల రియాక్షన్ కావాలని ముగించండి" అన్నారు మావారు.

చిన్నగా నవ్వి "చిక్కీ మీద నా కథ వల్ల నాకేదైనా చిక్కులు వస్తే మీరే రక్షించాలి." అని జోక్ చేసింది ప్రమీల.

చిక్కీ మాట వినగానే మా వాడికి మరలా చిక్కీ గుర్తొచ్చింది.

"మమ్మీ! నాకు చిక్కీ కావాలి." వాడు ఏడవబోయాడు. అందరూ నవ్వడంతో వాడు తెల్లబోయాడు.

"నాన్నా! వంశీ! చిక్కీ కావాలా? కాస్త ఆగరా.... మీ ప్రమీల ఆంటీ కొద్దిరోజుల్లో అందరికీ చిక్కీ ఇవ్వబోతోంది... అప్పుడు తిందుగానీ..." ప్రణతి మేనల్లుడి బుగ్గ గిల్లి అన్న మాటలు వాడికి అర్థం కాలేదు. వాడికి అర్థమయ్యే వయస్సు వచ్చేసరికన్నా చిక్కీలు కాకుండా, మంచి ప్రణాళికలు అమల్లోకి వస్తే బాగుణ్ణు.